# ఆవిరి

~ స్వాతి కుమారి బండ్లమూడి



## మ్యూజింగ్: ఆవిరి

రచన: స్వాతి కుమారి బండ్లమూడి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=344

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

## ఆవిరి

పెంకుటిళ్ల వెనకనుండి సాయంకాలాలు పైకిలేచే పొగ

సుళ్ళెత్తిన గాలిలో శివాలెత్తిన తెల్లఈక

కదిలే వాహనానికి ఎదురొడ్డి పరిగెడుతూ చెట్లూ, గట్లూ

వీటి ప్రయాణం లోపలికా, గుండ్రంగానా?

★

"మరెప్పుడో కాదు, ఈరాత్రికే అంతా– అంతా మనం అనుకున్నట్టే " అని నువ్వన్నప్పుడు పైకిచూసి తలొంచుకుని మళ్ళీ గోరుచిక్కుళ్ళు వలుచుకుంటుంటే– "నమ్మవని తెలుసు, మరెలా?" అనుకుంటూ పాత కాగితాలన్నీ వెదకడం మొదలెట్టావు. నీక్కావల్సిన రుజువు వాటిల్లో లేదని తెలిసి కూడా. "ఆరోజూ నువ్విలాగే చెప్పలేదూ! అదే ఆ సాయంత్రం గ్లాసులో టీపైన మీగడ కట్టేసినప్పుడు" అని నింపాదిగా చెబుతానా... సర్దుతున్న గుండుసూదులు, ఎప్పటివో శుభలేఖలు, పాత కరెంటు బిల్లులు ఒక్క ఉదుటున పడేసి తొందరగా వచ్చి మోకాళ్ల దండేసుకుని "అవును కదా! గుర్తొచ్చిందిగా, అలాగే ఇదీనూ!" అన్నావు వివరంగా చెప్పడం చేతగాకపోవడం వల్ల వచ్చిన ధీమాతో.

"ఐతే ఈ పూట వెల్లుల్లీ వెయ్యనా చిక్కుళ్లలో"

"నీకు భలే గుర్తూ! ఆరోజూ వేసుకున్నాం ఇలానే. అప్పుడు టైమెంతైందని నువ్వడిగి నేను చూసి చెప్పేలోపు నువ్వడిగినప్పటి టైమ్ మారిపోయింది కదా! ఇంకానేమో..." ఈలోగా రోడ్డుమీద కంకర గుమ్మరిస్తున్న చప్పుడు వంటగిన్నెల్లోంచి విసవిసమంటూ పైకిలేచింది.

★

"ఈ కవరు ఆ ఊరికి పంపాలి"

తుళ్ళిపాటు లేకుండానే నిద్రలోంచి ప్రశ్నలోకి నవ్వుతూ చొరబడ్డాడతను "ఇంత ఎండలో వచ్చారేం?" అంటూ–

"ఇది మొదటిసారి కాదుగా! పదేళ్లక్రితమోసారి ఇలాగే వచ్చాను గుర్తులేదూ? ఐనా అప్పుడున్నది మీరు కాదుకానీ మీక్కూడా గుర్తుండే ఉండాలి. ఈ పోస్టాఫీసు కూడా అప్పుడు వేరే

ఊర్లో ఉంది లెండి. నవ్వుగా ఉంది ఇదివరిలా వానలో రానంతమాత్రన మీరు నన్ను మర్చిపోవడం.. అంతే కదూ మనందరం? అసలదేగా తమాషా అంతానూ" ఏమంటారన్నట్టు అతని కనుబొమల వైపు చూశాను. అక్కడ అంతకుముందటి ముళ్ళు విడిపోయాయి.

ఆ గది నిండుకూ నవ్వేస్తూ అన్నాడు "నాకర్థమయిందిలెండి. ఈ కవరుపైన మీ చేతిరాతలో అడ్రెసూ, దానికంటుకున్న కాఫీ మరకా, ఇవి పంపడానికేగా లోపలేదో పుస్తకమో, పాతచొక్కానో, ఉంగరమో పెట్టి ఉంటారు బరువు తూగడం కోసం."

★

పగలంతా పగలబడ్డ ఎండ తరఫున క్షమాపణ అడగటానికి మొహమాట పడ్డట్టు సాయంత్రం కొద్దిగా జల్లుపడి ఆగినప్పుడు; సరిగ్గా అప్పుడే- మల్లెమొగ్గలబ్బాయి సందు చివర సైకిలాపి గట్టిగా కేకలేస్తాడు. పోయిన వేసవి కాలంగా అతనంతే- మల్లెలు లేనప్పుడు కూడా; ఒక్కోసారి "మంచు మొగ్గలోయ్" అనీ అరుస్తాడు.

ఇప్పుడూ- చీమల బారొకటి అటుగా వెళ్తూ ఉంటుంది. ఎండనపడి ఎక్కడినించో వచ్చి చెంబెడు నీళ్ళు కుమ్మరించి కళ్ళు కడిగేస్తావు వాటిపైన, అటు చూడకుండానో లేక "ఆ ఏముందిలెద్దూ" అనో. అర్థం కాలా? అంతేగా నువ్వైనా నేనైనా ఎప్పుడోసారి?

—

For Latest Telugu Books - Visit now:
Kinige.com